తొలివెలుగు

ప్రతి అక్షరం.. ప్రజల పక్షం.. జాతీయ దినపత్రిక

తెలంగాణ జిల్లాలు

యాదాద్రిభువనగిరి | శనివారం 19 సెప్టెంబర్ 2026

ఉత్సాహంగా ఎస్‌జీఎఫ్ క్రీడా ఎంపికలు

ఖో–ఖో, కబడ్డీ, వాలీబాల్‌లో ప్రతిభ చాటిన విద్యార్థినులు

క్రీడలతో క్రమశిక్షణ, ఆత్మవిశ్వాసం పెంపొందుతాయి

తొలివెలుగు, రాజాపేట : రాజాపేట మండలంలోని బాలికల సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలలో స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ (ఎస్‌జీఎఫ్) ఆధ్వర్యంలో శుక్రవారం మండల స్థాయి క్రీడా ఎంపిక పోటీలు ఉత్సాహంగా నిర్వహించారు. ఖో–ఖో, కబడ్డీ, వాలీబాల్ క్రీడాంశాల్లో అండర్–14, అండర్–17 విభాగాల్లో పోటీలు నిర్వహించారు. మండలంలోని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలకు చెందిన సుమారు 150 మంది బాలికలు పాల్గొన్నారు. మండల విద్యాశాఖ అధికారి కె.మనోజ్‌కుమార్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమానికి రాజాపేట సర్పంచ్ కోయ మధు, పాఠశాల ప్రిన్సిపాల్ సుధాకర్, మండలంలోని ఉన్నత పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, ప్రధానోపాధ్యాయురాళ్లు హాజరయ్యారు. ఖో–ఖో ఫెడరేషన్ ఆఫ్ తెలంగాణ ప్రధాన కార్యదర్శి నాతి కృష్ణమూర్తి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా మనోజ్‌కుమార్, కోయ మధు, సుధాకర్, నాతి కృష్ణమూర్తి మాట్లాడుతూ.. విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లోనూ రాణించాలని సూచించారు. క్రీడలు చదువుకు అడ్డంకి కాదని, విద్యార్థుల్లో క్రమశిక్షణ, ఆత్మవిశ్వాసం, నాయకత్వ లక్షణాలను పెంపొందించడంలో దోహదపడతాయని పేర్కొన్నారు. క్రీడాకారులకు అందుబాటులో ఉన్న 2 శాతం స్పోర్ట్స్ కోటాను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. మండల స్థాయి ఎంపిక పోటీల్లో ప్రతిభ కనబరిచి జిల్లా స్థాయి పోటీలకు ఎంపికై రాజాపేట మండలానికి మంచి పేరు తీసుకురావాలని క్రీడాకారులకు పిలుపునిచ్చారు. కాగా, ఎస్‌జీఎఫ్ మండల స్థాయి క్రీడా పోటీల నిర్వహణకు సహాయ సహకారాలు అందిస్తున్న బీజేపీ జిల్లా అధ్యక్షుడు ఊట్కూరి అశోక్‌గౌడ్‌కు ఎస్‌జీఎఫ్ మండల క్రీడా కార్యదర్శి పాతకోటి మధు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. క్రీడాకారులను ప్రోత్సహిస్తూ పోటీల విజయవంతమైన నిర్వహణకు సహకరిస్తున్న ఆయన సేవలను అభినందించారు. కార్యక్రమంలో మండలంలోని ఫిజికల్ డైరెక్టర్లు, ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

పంటలను పరిశీలించిన శాస్త్రవేత్తలు

రైతులకు సస్యరక్షణ చర్యలపై సూచనలు

తొలివెలుగు, ఆత్మకూరు(ఎం): మండలంలోని పలు గ్రామాల్లో సాగు చేస్తున్న పంటలను శుక్రవారం శాస్త్రవేత్తలు క్షేత్రస్థాయిలో పరిశీలించారు. టీఆర్‌వీకే భువనగిరి ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ డి.శ్రీలత, కేవీకే కంపసాగర్ శాస్త్రవేత్తలు రాములమ్మ, స్వాతి ఆధ్వర్యంలో వరి, పత్తి, కంది, ఆముదం పంటలను పరిశీలించారు. పంటల ప్రస్తుత పరిస్థితిని పరిశీలించిన శాస్త్రవేత్తలు రైతులకు పంటల సాగు, తెగుళ్ల నివారణ, సస్యరక్షణ చర్యలపై పలు సూచనలు, సలహాలు అందించారు. పంటలను ఎప్పటికప్పుడు పరిశీలిస్తూ తెగుళ్లు, చీడపీడలు గుర్తించిన వెంటనే తగిన నివారణ చర్యలు చేపట్టాలని సూచించారు. కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి సాతుపాటి శ్రీనివాసులు, వ్యవసాయ విస్తరణ అధికారి బి.రాజశేఖర్, రైతులు మజ్జిగ అశోక్, మోహన్‌రెడ్డి, బీరయ్య, యాస రవి, బిక్షపతి తదితరులు పాల్గొన్నారు.

చదువుతోపాటు క్రీడల్లోనూ రాణించాలి

అండర్–14, అండర్–17 పోటీల్లో ఎంజేపీటీ విద్యార్థుల ప్రతిభ

రాష్ట్రస్థాయి పోటీలకు ఏడుగురు విద్యార్థుల ఎంపిక

పీడీలు పి.హేమంత్‌కుమార్, ఎం.సతీష్‌లకు అభినందనలు

తొలివెలుగు, చౌటుప్పల్ : విద్యార్థులు చదువుతోపాటు క్రీడల్లోనూ రాణించి ఉన్నత స్థానాలకు చేరుకోవాలని ఏజీవో కే.వెంకట్రావు అన్నారు. గోల్కొండ, సైదాబాద్ జోనల్ స్థాయిలో నిర్వహించిన అండర్–14, అండర్–17 కబడ్డీ, ఖోఖో, వాలీబాల్, అథ్లెటిక్స్ పోటీల్లో దేశ్‌ముఖి మలక్‌పేట్, కార్వాన్ మహాత్మా జ్యోతిరావు పూలే గురుకుల బాలుర పాఠశాల విద్యార్థులు ప్రతిభ కనబరిచారు. హైదరాబాద్ జిల్లా స్థాయి పోటీల్లో ప్రథమ, ద్వితీయ స్థానాలు సాధించి సత్తా చాటారు. ఈ పోటీల్లో ప్రతిభ కనబరిచిన విద్యార్థుల్లో ఇద్దరు రాష్ట్రస్థాయి వాలీబాల్ పోటీలకు, ఐదుగురు రాష్ట్రస్థాయి అథ్లెటిక్స్ పోటీలకు ఎంపికైనట్లు పాఠశాల ప్రిన్సిపాల్ టి.శ్వేత తెలిపారు. విజయం సాధించిన విద్యార్థులతో పాటు వారికి శిక్షణ అందించిన ఫిజికల్ డైరెక్టర్లు పి.హేమంత్‌కుమార్, ఎం.సతీష్‌లను ఆమె అభినందించారు. ఏజీవో కే.వెంకట్రావు మాట్లాడుతూ.. విద్యార్థులను క్రీడల్లో నిష్ణాతులుగా తీర్చిదిద్దుతున్న పీడీల కృషి అభినందనీయమన్నారు. రాష్ట్రస్థాయి పోటీల్లోనూ విద్యార్థులు ప్రతిభ కనబరిచి పాఠశాలకు మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు. శుక్రవారం పాఠశాలలో నిర్వహించిన కార్యక్రమంలో ప్రిన్సిపాల్ టి.శ్వేత, అధ్యాపక బృందం క్రీడల్లో విజయం సాధించిన విద్యార్థులను, పీడీలను అభినందించి సన్మానించారు. కార్యక్రమంలో ఏటీపీ ఏ.రవిశంకర్, బి.డబ్ల్యూ.జ్యోత్స్న, అధ్యాపకులు, విద్యార్థులు, పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.

22ఏ నిషేధిత జాబితా నుంచి భూములను తొలగించాలి

పేదల భూములపై ప్రభుత్వం కాలయాపన చేయొద్దు

బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు కల్లూరి రాంచంద్రారెడ్డి

తొలివెలుగు, రాజాపేట: 22ఏ నిషేధిత భూముల జాబితాలో ఉన్న పేదల భూములను వెంటనే తొలగించి వారికి పూర్తి హక్కులు కల్పించాలని బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు కల్లూరి రాంచంద్రారెడ్డి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శుక్రవారం రాజాపేటలో ఆయన మాట్లాడుతూ నిషేధిత భూముల జాబితా కారణంగా రాష్ట్రవ్యాప్తంగా పేద, మధ్యతరగతి ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని అన్నారు. ఏళ్ల తరబడి హక్కులు అనుభవిస్తున్న భూములను 22ఏ జాబితాలో చేర్చడం వల్ల వాటి క్రయవిక్రయాలు నిలిచిపోయి, అవసరాల కోసం భూములను విక్రయించుకోలేక బాధితులు ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని రాంచంద్రారెడ్డి పేర్కొన్నారు. సమస్యను పరిష్కరించకుండా కమిటీలు, సర్వేల పేరుతో కాలయాపన చేస్తున్నారని ప్రభుత్వంపై విమర్శలు చేశారు. "పేదల భూములను నిషేధిత జాబితా నుంచి తొలగించకుండా కొత్తగా భూ సర్వేలు నిర్వహించడం వల్ల ప్రయోజనం ఏమిటి?" అని ఆయన ప్రశ్నించారు. బాధితుల సమస్యలను తక్షణమే పరిష్కరించి, అర్హత ఉన్న భూములను 22ఏ జాబితా నుంచి మినహాయించాలని కోరారు. పేదలు, సామాన్య ప్రజల భూ హక్కుల కోసం బీఆర్ఎస్ తరఫున పోరాటం కొనసాగిస్తామని ఆయన స్పష్టం చేశారు.

కార్యక్రమంలో బీఆర్ఎస్ రాజాపేట మండల అధ్యక్షుడు సట్టు తిరుమలేష్, బొందుగుల మాజీ సర్పంచ్ జూలుకుంట్ల రామ్‌గోపాల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా మహా అన్నప్రసాద వితరణ

గణనాథుడికి ప్రత్యేక పూజలు నిర్వహించిన చేనేత సహకార సంఘం అధ్యక్షుడు

తొలివెలుగు, భూదాన్‌పోచంపల్లి: పురపాలక కేంద్రంలోని ఆచార్య కొండా లక్ష్మణ్ బాపూజీ యువజన సమాఖ్య ఆధ్వర్యంలో గణేష్ పంచమరాత్రోత్సవాల్లో భాగంగా శుక్రవారం మహా అన్నప్రసాద వితరణ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా చేనేత సహకార సంఘం అధ్యక్షుడు భారత లవకుమార్, కార్యదర్శి సూరపల్లి శ్రీనివాస్, 8వ వార్డు కౌన్సిలర్ దేవరాయ కుమార్ హాజరయ్యారు. ఈ సందర్భంగా గణనాథుడికి ప్రత్యేక పూజలు నిర్వహించి, అనంతరం మహా అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభించారు. భక్తులు, స్థానికులు అధిక సంఖ్యలో పాల్గొని అన్నప్రసాదాన్ని స్వీకరించారు. కార్యక్రమంలో సమాఖ్య అధ్యక్షుడు కోడి బాలరాజు, ప్రధాన కార్యదర్శి కేమ విష్ణుమూర్తి, గౌరవ అధ్యక్షుడు తుమ్మ అంబదాసు, సీతా పాండు, ఉపాధ్యక్షులు కురివి భాస్కర్, గుజ్జ శ్రీనివాస్, సహాయ కార్యదర్శులు పున్న యాదగిరి, మాకని పాండు, కోశాధికారి ఆడెపు భాస్కర్,

సహాయ కోశాధికారి కడవేరు లక్ష్మీ కాంత్, కార్యవర్గ సభ్యులు బడుగు లక్ష్మణ్, చిట్టిమల్ల ఐలయ్య, సకినాల నాగయ్య, భోగ సత్యనారాయణ, భోగ యాదగిరి, చెరుపల్లి దివ్య, కేమ నీరజ తదితరులు పాల్గొన్నారు.

డయాలసిస్ కోసం రూ.లక్ష ఎల్ఓసీ అందజేత

ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి సహకారంతో ఆర్థిక సాయం

తొలివెలుగు, చౌటుప్పల్: మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి సహకారంతో 18వ వార్డుకు చెందిన పి.ఓంప్రకాశ్‌కు వైద్య చికిత్స నిమిత్తం రూ.1 లక్ష విలువైన ఎల్ఓసీని అందజేశారు. కిడ్నీ సంబంధిత వ్యాధితో బాధపడుతున్న ఓంప్రకాశ్‌కు అత్యవసర డయాలసిస్ అవసరం ఉండటంతో ఈ ఆర్థిక సాయం అందించినట్లు తెలిపారు. ఈ సందర్భంగా ఓంప్రకాశ్ కుటుంబ సభ్యులు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఆపద సమయంలో స్పందించి వైద్య ఖర్చులకు ఆర్థిక సహాయం అందించడం పట్ల ధన్యవాదాలు వ్యక్తం చేశారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ గోశిక వినయ్‌కుమార్, మున్సిపల్ అధ్యక్షుడు కాసర్ల శ్రీనివాస్‌రెడ్డి, కాంగ్రెస్ నాయకులు కామిశెట్టి భాస్కర్, గుగులోతు శంకర్‌నాయక్ తదితరులు పాల్గొన్నారు.

టీబీ క్యాంపులను సద్వినియోగం చేసుకోవాలి

సర్పంచ్ పులి రాజు

తొలివెలుగు, రాజాపేట: ప్రజలు ప్రభుత్వం నిర్వహిస్తున్న టీబీ, బీపీ, షుగర్ వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని నెమిల సర్పంచ్ పులి రాజు సూచించారు. రాజాపేట ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని నెమిల గ్రామంలో శుక్రవారం టీబీ, బీపీ, షుగర్ పరీక్షల కోసం వైద్య శిబిరాన్ని నిర్వహించారు. శిబిరంలో భాగంగా టీబీ నిర్ధారణ కోసం ఎక్స్‌రే, కఫం (తెమడ) పరీక్షలతో పాటు రక్త పరీక్షలు నిర్వహించారు. సుమారు 96 మందికి ఎక్స్‌రే పరీక్షలు, 129 మందికి బీపీ, షుగర్ పరీక్షలు నిర్వహించినట్లు వైద్య సిబ్బంది తెలిపారు.

శిబిరాన్ని సర్పంచ్ పులి రాజు, ఉపసర్పంచ్ మార్క శివ, వార్డు సభ్యులు ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామీణ ప్రాంత ప్రజలు ఆరోగ్యంపై నిర్లక్ష్యం చేయకుండా వైద్య పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో జిల్లా టీబీ సూపర్‌వైజర్ జ్యోతి, టెక్నీషియన్ నటేష్, ఎయిమ్స్ టెక్నీషియన్లు, ఎంపీహెచ్ఈఓ వై.భీకునాయక్, ఎంఎల్‌హెచ్‌పీ ఉషారాణి, మాధవి, కవిత, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

లంబోదరుడికి లక్ష పుష్పార్చనలు

భక్తిశ్రద్ధలతో పాల్గొన్న భక్తజనం
ప్రత్యేక పూజలు నిర్వహించిన బెజుగం నాగభూషణం–లిఖిత దంపతులు
దాతలను సత్కరించిన ఆలయ నిర్వాహకులు

తొలివెలుగు, రాజాపేట: రాజాపేటలోని శ్రీరామకృష్ణ సాయి మందిరంలో నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా కొలువుదీరిన శ్రీ విఘ్నేశ్వరుడికి శుక్రవారం లక్ష పుష్పార్చన పూజా కార్యక్రమాన్ని భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు. ఆలయ ప్రధాన అర్చకులు చెలివేదుల వెంకట రామకృష్ణ ప్రసాద్ శర్మ ఆధ్వర్యంలో పూజా కార్యక్రమాలు సాంప్రదాయబద్ధంగా జరిగాయి. ముందుగా బెజుగం నాగభూషణం–లిఖిత దంపతులు గణనాథుడికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం వివిధ రకాల పుష్పాలతో స్వామివారికి లక్ష పుష్పార్చన నిర్వహించగా, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని పూజల్లో భాగస్వాములయ్యారు. స్వామివారి స్తోత్ర నామస్మరణలతో ఆలయ ప్రాంగణం భక్తిమయంగా మారింది. పూజల అనంతరం మంగళహారతి నిర్వహించి భక్తులు భక్తిశ్రద్ధలతో స్వామివారిని దర్శించుకున్నారు. భక్తులకు ఆలయ అర్చకులు తీర్థప్రసాదాలు అందజేసి వేద ఆశీర్వచనం చేశారు. ఈ సందర్భంగా లక్ష పుష్పార్చన విశిష్టతను వివరించారు. కార్యక్రమానికి బెజగం నాగభూషణం–లిఖిత దంపతులు, పులిగిల్ల నరసింహులు–రాధిక దంపతులు ఆర్థిక సహకారం అందించారు. ఊట్కూరు లక్ష్మీ నారాయణగౌడ్–బాలమణి దంపతులు అన్నప్రసాద వితరణ చేపట్టారు. అనంతరం భక్తులకు అన్నప్రసాదం పంపిణీ చేశారు. శనివారం స్వామివారికి చిత్రాన్న పూజా కార్యక్రమం నిర్వహించనున్నట్లు ఆలయ నిర్వాహకులు తెలిపారు. కార్యక్రమానికి సహకరించిన దాతలను సత్కరించి కృతజ్ఞతలు తెలిపారు.

ఆర్థిక సహాయం అందజేత

బాధిత కుటుంబాన్ని పరామర్శించిన ముద్దసాని కిరణ్‌కుమార్‌రెడ్డి

తొలివెలుగు, వలిగొండ: వలిగొండ మండలం మొగిలిపాక గ్రామానికి చెందిన బీఆర్ఎస్ నాయకులు మచ్చ రాములు, మచ్చ ముత్యాల తల్లి మచ్చ పోషమ్మ మృతి చెందడంతో శ్రీ మత్స్యగిరి లక్ష్మీనరసింహస్వామి దేవస్థానం మాజీ చైర్మన్ ముద్దసాని కిరణ్‌కుమార్‌రెడ్డి శుక్రవారం వారి కుటుంబాన్ని పరామర్శించారు. ఈ సందర్భంగా పోషమ్మ పార్థివదేహానికి పూలమాల వేసి నివాళులర్పించిన అనంతరం కుటుంబ సభ్యులను ఓదార్చారు. అనంతరం వారి కుటుంబానికి రూ.10 వేల ఆర్థిక సహాయాన్ని అందజేశారు. కుటుంబానికి అండగా ఉంటామని ఆయన భరోసా ఇచ్చారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ జడిగే బుచ్చయ్య, గ్రామశాఖ అధ్యక్షుడు భీమనబోయిన బిక్షపతి, ఉపసర్పంచ్ షేక్ సైదులు, వార్డు సభ్యులు పబ్బు వెంకటేష్, మచ్చ సునీత స్వామి, మాజీ సర్పంచ్ జక్కుల శంకరయ్య, మాజీ ఉపసర్పంచ్ భీమనబోయిన నర్సింహ, మాజీ పాల సంఘం చైర్మన్ పబ్బు సత్తయ్య, మద్ది పాండురంగారెడ్డి, మాజీ వార్డు సభ్యులు జడిగే సత్యరాములు, ముద్దసాని శేఖర్‌రెడ్డితో పాటు బీఆర్ఎస్ నాయకులు జడిగే గోపాల్, ఉక్కుర్తి బిక్షపతి, జక్క శ్రీనివాస్‌రెడ్డి, జమచ్చ నవీన్, పబ్బు మల్లేష్, కొండమీది సురేందర్, గుండాల రమేష్, మొగిలిపాక పెంటయ్య, మర్ల లక్ష్మయ్య, సింగం మహేష్, పబ్బు బాలకృష్ణ, భీమనబోయిన మచ్చేందర్, షేక్ ఖాసీం, షేక్ అజీత్ తదితరులు పాల్గొన్నారు.

లోతట్టు ప్రాంతాల డ్రైనేజీ సమస్యకు తక్షణ పరిష్కారం

సమస్యను పరిశీలించి తాత్కాలిక మరమ్మతులు చేపట్టిన మున్సిపల్ చైర్మన్
శాశ్వత పరిష్కారం కోసం ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్తామని హామీ

తొలివెలుగు, చౌటుప్పల్: పట్టణంలో శుక్రవారం కురిసిన వర్షంతో 12వ వార్డులోని లోతట్టు ప్రాంతాల్లో నెలకొన్న డ్రైనేజీ సమస్యను వార్డు కౌన్సిలర్ పాక చిరంజీవి యాదవ్ మున్సిపల్ చైర్మన్ మోగుదాల పావని రమేష్‌గౌడ్ దృష్టికి తీసుకెళ్లారు. దీంతో చైర్మన్ వెంటనే స్పందించి సంబంధిత ప్రాంతాలను పరిశీలించారు. లోతట్టు ప్రాంతాల్లో వర్షపు నీరు నిలిచిపోవడంతో ప్రజలు ఎదుర్కొంటున్న ఇబ్బందులను పరిశీలించిన చైర్మన్.. తక్షణ ఉపశమనం కోసం డ్రైనేజీకి తాత్కాలిక మరమ్మతులు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. సమస్యకు శాశ్వత పరిష్కారం కల్పించేందుకు మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లి అవసరమైన చర్యలు చేపడతామని కాలనీ ప్రజలకు భరోసా ఇచ్చారు.

వర్షాల సమయంలో ప్రజలకు ఇబ్బందులు తలెత్తకుండా డ్రైనేజీ వ్యవస్థను మెరుగుపర్చేందుకు చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరారు.

కత్తితో పాల బూత్ నిర్వాహకుడిపై దాడి

కోర్టు వివాదం నేపథ్యంలో ఘటన.. ఐసీయూలో చికిత్స

తొలివెలుగు, వనస్థలిపురం: కోర్టులో కొనసాగుతున్న వివాదాన్ని మనసులో పెట్టుకుని ఓ వ్యక్తి పాల బూత్ నిర్వాహకుడిపై కత్తితో దాడి చేసిన ఘటన వనస్థలిపురం పోలీస్‌స్టేషన్ పరిధిలో శుక్రవారం ఉదయం చోటుచేసుకుంది. పోలీసుల వివరాల ప్రకారం.. గుర్రంగూడకు చెందిన దంగేటి భుజంగరావు (72) వనస్థలిపురం ఎన్‌జీవో కాలనీలో పాల బూత్, పేపర్ స్టాల్ నిర్వహిస్తున్నారు. గతంలో శివేందర్ సింగ్ అనే వ్యక్తి భుజంగరావు వద్ద 2బీహెచ్‌కే ఫ్లాట్ కొనుగోలు చేసినట్లు పోలీసులు తెలిపారు. ఈ వ్యవహారంలో ఇరువురి మధ్య వివాదం ఏర్పడి ప్రస్తుతం కోర్టులో కేసు కొనసాగుతున్నట్లు పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో శుక్రవారం ఉదయం సుమారు 5.30 గంటలకు భుజంగరావు ద్విచక్రవాహనంపై పాల బూత్‌కు వెళ్తుండగా ఎస్‌కేడీ నగర్ ఎక్స్ రోడ్డు వద్ద శివేందర్ సింగ్ అడ్డగించి కత్తితో దాడి చేసినట్లు పోలీసులు తెలిపారు. దాడిలో తీవ్రంగా గాయపడిన భుజంగరావును కుటుంబ సభ్యులు, స్థానికులు వెంటనే ఎల్బీనగర్‌లోని కామినేని ఆస్పత్రికి తరలించారు. ప్రస్తుతం ఆయన ఐసీయూలో చికిత్స పొందుతున్నట్లు సమాచారం. ఘటనపై వనస్థలిపురం పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. నిందితుడిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటున్నట్లు పోలీసులు తెలిపారు.

జాబ్‌మేళాకు పోటెత్తిన నిరుద్యోగులు

కోదాడ: ఉద్యోగ అవకాశాల కోసం ఎదురుచూస్తున్న నిరుద్యోగ యువతకు నిర్వహించిన మెగా జాబ్‌మేళాకు విశేష స్పందన లభించింది. కోదాడ పట్టణంలోని సీసీ రెడ్డి కాన్వెంట్‌లో శనివారం నిర్వహించిన జాబ్‌మేళాకు పెద్ద సంఖ్యలో నిరుద్యోగులు తరలివచ్చారు. ఉదయం నుంచే అభ్యర్థులు భారీగా చేరుకోవడంతో ప్రాంగణం కిక్కిరిసిపోయింది. ఉద్యోగం సాధించాలనే ఆశతో వచ్చిన అభ్యర్థులు ముందుగా తమ పేర్లను నమోదు చేసుకుని, అర్హతలకు అనుగుణంగా కేటాయించిన స్టాల్స్ వద్దకు చేరుకున్నారు. ఒక్కో స్టాల్ వద్ద అభ్యర్థులు క్యూలైన్లలో నిలబడి సంస్థల ప్రతినిధులకు ఇంటర్వ్యూలు, ఇతర ఎంపిక ప్రక్రియల్లో పాల్గొన్నారు. వివిధ రంగాలకు చెందిన ఉద్యోగ అవకాశాలు అందుబాటులో ఉండటంతో యువత నుంచి మంచి స్పందన కనిపించింది. జాబ్‌మేళాకు భారీగా అభ్యర్థులు తరలిరావడంతో నిర్వాహకులు వారికి ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ఏర్పాట్లు చేశారు. అభ్యర్థుల రద్దీని దృష్టిలో ఉంచుకుని క్యూలైన్లు, స్టాల్స్ వద్ద క్రమబద్ధమైన ఏర్పాట్లు చేపట్టారు. ఉద్యోగం కోసం వచ్చిన ప్రతి అభ్యర్థికి అవకాశం కల్పించేలా ఎంపిక ప్రక్రియ కొనసాగింది.

పటిష్ట బందోబస్తు

జాబ్‌మేళా సందర్భంగా ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా పోలీసులు పటిష్ట భద్రతా ఏర్పాట్లు చేపట్టారు. భారీగా నిరుద్యోగులు తరలిరావడంతో రద్దీ నియంత్రణపై ప్రత్యేక దృష్టి సారించారు. ఎస్పీ నరసింహ స్వయంగా భద్రతా ఏర్పాట్లను పర్యవేక్షిస్తూ పోలీసు సిబ్బందికి పలు సూచనలు చేశారు. అభ్యర్థులు ప్రశాంత వాతావరణంలో ఇంటర్వ్యూలకు హాజరయ్యేలా పోలీసులు చర్యలు చేపట్టారు. ఉద్యోగం కోసం పెద్ద సంఖ్యలో యువత ఒకే వేదికకు చేరడంతో సీసీ రెడ్డి కాన్వెంట్ పరిసరాల్లో సందడి నెలకొంది. తమ అర్హతలకు తగిన ఉద్యోగం లభిస్తుందనే ఆశతో అభ్యర్థులు ఉత్సాహంగా ఇంటర్వ్యూలకు హాజరయ్యారు. జాబ్‌మేళా ద్వారా స్థానిక నిరుద్యోగ యువతకు ఉపాధి అవకాశాలు లభించే అవకాశం ఉండటంతో అభ్యర్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకునేందుకు ఆసక్తి చూపారు.

పాత పంచాయతీ భవనం కూల్చివేత..

తీవ్ర ఉద్రిక్తతలకు దారి

తిమ్మాపూర్: తిమ్మాపూర్ మండలం మన్నెంపెల్లి గ్రామంలో పాత గ్రామ పంచాయతీ భవనం కూల్చివేత తీవ్ర ఉద్రిక్తతలకు దారితీసింది. శనివారం ఉదయం 7 గంటలకే భారీ పోలీసు బందోబస్తు మధ్య అధికారులు జేసీబీలతో గ్రామానికి చేరుకుని పాత పంచాయతీ భవనాన్ని కూల్చేందుకు సిద్ధమయ్యారు. దీంతో సర్పంచ్ సునీతతో పాటు పలువురు వార్డు సభ్యులు కూల్చివేతను అడ్డుకున్నారు. ఇటీవల నిర్వహించిన గ్రామసభలో పాత పంచాయతీ భవనాన్ని గ్రామ అవసరాల కోసం వినియోగించుకోవాలని తీర్మానం చేసినట్లు సర్పంచ్ సునీత తెలిపారు. అందులో భాగంగానే భవనానికి ఇటీవల మరమ్మతులు కూడా చేపట్టామని పేర్కొన్నారు. గ్రామసభలో తీర్మానం చేసినప్పటికీ అధికారులు భవనాన్ని కూల్చేందుకు రావడం ఏమిటని ఆమె ప్రశ్నించారు. గ్రామసభ తీర్మానానికి విలువ లేదా? అని నిలదీశారు.

ముందస్తు నోటీసు ఇవ్వలేదంటూ సర్పంచ్ ఆగ్రహం

ఎలాంటి ముందస్తు నోటీసులు ఇవ్వకుండా పాత పంచాయతీ భవనాన్ని ఎలా కూల్చివేస్తారని సర్పంచ్ ప్రశ్నించారు. భవనం కూల్చివేతకు జిల్లా కలెక్టర్ నుంచి ఆదేశాలు ఉన్నాయని అధికారులు చెప్పగా.. తమకు ఎలాంటి ఆదేశాలు అందలేదని ఆమె పేర్కొన్నారు. అధికారులు భవనం కూల్చివేతకు సిద్ధం కావడంతో సర్పంచ్‌తో పాటు కొందరు పాలకవర్గ సభ్యులు అడ్డుకున్నారు. దీంతో అక్కడ ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి.

నిరసనకారులను అదుపులోకి తీసుకున్న పోలీసులు

పంచాయతీ భవనం కూల్చివేతను అడ్డుకున్న వారిని పోలీసులు అదుపులోకి తీసుకోవడంపై కొందరు పాలకవర్గ సభ్యులు అసంతృప్తి వ్యక్తం చేశారు. నిరసన చేస్తున్న వారిని పోలీసులు బలవంతంగా పోలీసు వాహనాల్లోకి ఎక్కిస్తుండగా.. పలువురు "ఇదేమి రాజ్యం.. ఇదేమి రాజ్యం.. దొంగల రాజ్యం.. దోపిడీ రాజ్యం" అంటూ నినాదాలు చేశారు. తీవ్ర ఉద్రిక్తతల నడుమ అధికారులు పాత పంచాయతీ భవనాన్ని కూల్చివేశారు. ఈ ఘటనపై గ్రామంలో తీవ్ర చర్చ జరుగుతోంది.

నిమజ్జన ఏర్పాట్లపై సర్పంచ్ పరిశీలన

భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చర్యలు

తొలివెలుగు, ఆత్మకూరు(ఎం): మండల కేంద్రంలో నిర్వహించనున్న వినాయక నిమజ్జన కార్యక్రమానికి సంబంధించి ఏర్పాట్లను శుక్రవారం సర్పంచ్ బీసు ధనలక్ష్మి చందర్‌గౌడ్ పరిశీలించారు. ఇందులో భాగంగా నిమజ్జనం నిర్వహించనున్న చెరువు పరిసరాలను పరిశీలించి, భక్తులు, ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చర్యలు చేపట్టాలని సూచించారు. చెరువు పరిసరాల్లో పారిశుద్ధ్య పనులు చేపట్టించి, నిమజ్జనానికి వచ్చే ప్రజలకు సౌకర్యవంతంగా ఉండేలా ఏర్పాట్లు చేయించారు. నిమజ్జన కార్యక్రమం ప్రశాంతంగా, సురక్షితంగా జరిగేలా అవసరమైన అన్ని చర్యలు తీసుకోవాలని సిబ్బందికి సూచించారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి అంబోజు శేఖర్, శ్రీనివాస్ పాల్గొన్నారు.

దురుసుగా మాట్లాడిన కండక్టర్‌పై ఫిర్యాదు

కాలేజ్ విద్యార్థినితో అనుచితంగా ప్రవర్తించారంటూ తల్లిదండ్రుల ఆరోపణ

తొలివెలుగు, రాజాపేట: రాజాపేట మండలం కొండ్రెడ్డిచెరువు గ్రామానికి వచ్చే యాదగిరిగుట్ట డిపో అద్దె బస్సు కండక్టర్ దురుసు ప్రవర్తనతో ప్రయాణికులు ఇబ్బందులు ఎదుర్కొన్నట్లు ఆరోపణలు వచ్చాయి. శుక్రవారం ఉదయం కొండ్రెడ్డిచెరువు నుంచి ఉప్పల్‌కు వెళ్తున్న బస్సులో ఈ ఘటన చోటుచేసుకున్నట్లు సమాచారం. బస్సులో కండక్టర్‌గా విధులు నిర్వహిస్తున్న ఎం.పద్మ (175403) ఓ కాలేజీ విద్యార్థినితో దురుసుగా మాట్లాడటంతో పాటు అసహనం వ్యక్తం చేశారని విద్యార్థిని తల్లిదండ్రులు ఆరోపించారు. దీంతో వారు ఆర్టీసీ అధికారులకు ఫోన్ ద్వారా ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. సమస్యపై అధికారులు స్పందించకపోతే జిల్లా కలెక్టర్‌కు లిఖితపూర్వకంగా ఫిర్యాదు చేస్తామని విద్యార్థిని తండ్రి పేర్కొన్నారు. కాగా, సదరు కండక్టర్ గతంలోనూ విధుల నిర్వహణకు సంబంధించి ఫిర్యాదులు ఎదుర్కొని శాఖాపరమైన చర్యలకు గురైనట్లు స్థానికంగా చర్చ జరుగుతోంది. అయితే ఈ ఆరోపణలపై ఆర్టీసీ అధికారుల నుంచి అధికారిక వివరణ వెలువడాల్సి ఉంది. ప్రయాణికులతో సిబ్బంది మర్యాదగా వ్యవహరించేలా చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.

వైన్స్‌లో భారీ అగ్నిప్రమాదం

ఇబ్రహీంపట్నం: రంగారెడ్డి జిల్లా కందుకూరు మండల కేంద్రంలోని జై భవాని వైన్స్‌లో శనివారం ఉదయం భారీ అగ్నిప్రమాదం చోటుచేసుకుంది. ఉదయం 7 గంటల నుంచి 7:30 గంటల మధ్య ఒక్కసారిగా మంటలు చెలరేగినట్లు సమాచారం. షార్ట్‌సర్క్యూట్ కారణంగానే ప్రమాదం సంభవించినట్లు ప్రాథమికంగా అనుమానిస్తున్నారు. సమాచారం అందుకున్న పోలీసులు వెంటనే అగ్నిమాపక సిబ్బందికి సమాచారం అందించారు. ఉదయం 7:40 గంటల ప్రాంతంలో ఫైర్ సిబ్బంది ఘటనాస్థలికి చేరుకుని తీవ్రంగా శ్రమించి మంటలను అదుపులోకి తీసుకొచ్చారు. అయితే అప్పటికే మంటల ధాటికి వైన్స్‌లోని మద్యం, ఇతర సామగ్రి భారీగా దగ్ధమైనట్లు తెలుస్తోంది. వైన్స్‌లో సుమారు రూ.1.50 కోట్ల విలువైన మద్యం, ఇతర సామగ్రి ఉన్నట్లు ప్రాథమికంగా అంచనా వేస్తున్నారు. అయితే వాస్తవంగా జరిగిన ఆస్తి నష్టం ఎంత అన్నది అధికారుల పరిశీలన అనంతరం తేలనుంది. జై భవాని వైన్స్ షాద్‌నగర్‌కు చెందిన నవీన్‌కు చెందినదిగా సమాచారం. ప్రమాద విషయం తెలుసుకున్న సర్పంచ్ సరికొండ పాండు, వార్డు సభ్యులు ఘటనాస్థలికి చేరుకుని పరిస్థితిని పరిశీలించారు. అగ్నిప్రమాదానికి అసలు కారణం ఏమిటి? షార్ట్‌సర్క్యూట్ వల్లే ప్రమాదం జరిగిందా? వైన్స్‌లో ఎంత మేరకు నష్టం వాటిల్లింది? అనే అంశాలపై పోలీసులు దర్యాప్తు చేపట్టారు.